29న ఉచిత మెగా కాక్లియర్ ఇంప్లాంట్ స్క్రీనింగ్ శిబిరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో ఉచిత మెగా కాక్లియర్ ఇంప్లాంట్ స్క్రీనింగ్ శిబిరాన్ని ఈనెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు జెమ్స్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కాక్లియర్ ప్లాంట్ సర్జన్ డాక్టర్ జనార్ధనరావు నేతృత్వాన నిర్వహించే శిబిరాన్ని ఒకటి నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు వినికిడి లోపం ఉన్న, వినికిడి యంత్రం ద్వారా పూర్తిగా లబ్ధి పొందని, వయసుకు తగ్గట్లుగా మాట్లాడలేని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ, ఏడిప్ పథకం ద్వారా ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7680945332, 7989290370 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఒడిదుడుకుల్లో వ్యవసాయం

- వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో తగ్గిన సాగు
- అన్నదాతలకు తప్పని సాగునీటి కష్టాలు
- రబీని వీడని వర్షాభావ పరిస్థితులు
- ధాన్యం అమ్ముకునేందుకు రైతుల అవస్థలు

బూర్జలో మోటారుతో పొలానికి నీరు పెడుతున్న రైతులు (ఫైల్)

జిల్లాలో ఈ ఏడాది ఒడిదుడుకుల మధ్యే వ్యవసాయం సాగింది. ఖరీఫ్ ప్రారంభం నుంచి వెంటాడిన వర్షాభావ పరిస్థితులు చివరివరకూ సాగాయి. వేలాది ఎకరాల్లో రైతులు పంటలు వేయలేకపోగా వేసినవీ ఎండిపోయాయి. జులై, ఆగస్టులో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వేలాది ఎకరాల్లో రైతులు విత్తనాలు వేయలేకపోయారు. ఈసారి తుపాన్లు, అధిక వర్షాల ప్రభావం పెద్దగా లేకపోవడంతో రైతులకు కొంత ఊరటనిచ్చింది. ఒకట్రెండు అల్పపీడనాలు భయపెట్టినా, పంటపై పెద్దగా ప్రభావం చూపలేదు. ధాన్యం దిగుబడి అనుకున్నంత స్థాయిలో వచ్చినా కొనుగోళ్ల కోసం రైతులు ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో లక్ష్యం మేర పంటలు సాగు కాలేదు. అన్నిరకాల పంటలు కలిపి 4,37,165 ఎకరాల సాగు లక్ష్యంగా నిర్ధేశించుకోగా 3,81,833 ఎకరాల్లో పంటలు వేశారు. వరి పంటను 3,98,750 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా 3,39,588 ఎకరాల్లో సాగైంది. మొక్కజొన్న పంటను ఈ ఏడాది 26,375 ఎకరాల విస్తీర్ణం వేయాలని అనుకోగా 23,633 ఎకరాల్లో వేశారు. పత్తి పంటను 4,620 ఎకరాల్లో వేయాలనుకోగా 2,763 మేర వేశారు. చెరుకు పంటను 4,550 ఎకరాల మేర వేస్తారని అంచనా వేయగా 1470 ఎకరాల మేర వేశారు. పెసలు, రాగులు, గోగు పంటల సాగు 20 శాతం లోపే ఉంది. జిల్లాలో మొత్తమ్మీద 70 వేల ఎకరాల్లో పంటలు వేయలేదు.

20 వేల ఎకరాల్లో ఎండిన వరి

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో 15 మండలాల పరిధిలో 20,813 ఎకరాల్లో వరి ఎండిపోయింది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, కవిటి మండలాల్లో వరి పంట బాగా దెబ్బతింది. వీటితో పాటు పలాస నియోజకవర్గంలోని మూడు మండలాలు, మెళియాపుట్టి, సంతబొమ్మాళి, నందిగాం, పోలాకి, గార, ఎచ్చెర్ల, జి.సిగడాం, సారవకోట మండలాలు ఉన్నాయి. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 70 వేల ఎకరాల్లో పంటలు సాగు కాలేదని వ్యవసాయశాఖ నివేదికలు చెప్తున్నాయి. అందులో వరి పంటే 59 వేల ఎకరాలకు పైగా ఉంది. పంటలు సాగైనట్లు లెక్కలు చెప్తున్నా కొన్నిచోట్ల ఎండిపోతున్నాయి.

సాగునీరందక రైతుల పాట్లు

వర్షాధారంపై ఆధారపడిన మెట్ట ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులే సాగునీటి కాలువ కింద ఉన్న ప్రాంతాల్లోనూ ఉన్నాయి. ఒడిశాలో కాస్తాకూస్తో వర్షాలు పడుతుండడంతో హిరమండలం గొట్టాబ్యారేజీ వద్ద తగినంత నీటి నిల్వలు ఉండనే ఉన్నాయి. కాలువల్లోకి నీటిని విడిచిపెడుతున్నా, అవి శివారు భూములకు చేరలేదు. కాలువల్లో పెద్దఎత్తున పూడిక, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. వర్షాల్లేక ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడ్డారు. ఇంజిన్లు పెట్టుకుని పొలాలను తడుపుకున్నారు. కొన్నిచోట్ల ఆ అవకాశమూ లేకుండా పోయింది. వర్షాభావ పరిస్థితులతో పలు మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో, చెరువులు ఎండిపోయిన పరిస్థితులను ఈ ఏడాది రైతులు చవిచూశారు.

మారని కౌలు రైతుల దుస్థితి

కౌలు రైతుల దుస్థితి ఈ ఏడాది మారలేదు. భూ యజమానులు అంగీకార పత్రం ఇవ్వకపోవడంతో వేలాది మంది కౌలు రైతులు గుర్తింపు కార్డులకు నోచుకోలేదు. భూ యజమానులు చివరకు ఆధార్ కార్డు ఇచ్చేందుకూ నిరాకరించారు. జిల్లాలో సుమారు 1.50 లక్షల మంది కౌలు రైతులు ఉండగా 7,346 మందికి కార్డులను అందజేశారు. కార్డులు పొందినా రైతుభరోసా ప్రయోజనాలకు నోచుకోలేదు. కౌలు గుర్తింపు కార్డు లేకపోవడంతో బ్యాంకుల నుంచి రుణాలు కూడా దక్కలేదు. దీంతో వారు ప్రయివేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పులు చేసి వ్యవసాయం నెట్టుకొచ్చారు.

వరికి నామమాత్రంగా మద్దతు ధర పెంపు

ఈ ఏడాది వ్యవసాయ ఖర్చులు వేలల్లో పెరగ్గా, కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగా మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంది. గతేడాది సాధారణ రకం రూ.2040 ఉండగా ప్రస్తుతం రూ.2183కు పెంచింది. అదేవిధంగా 'ఎ' గ్రేడ్ రకం ధాన్యానికి గత ఖరీఫ్‌లో రూ.2060 చెల్లించగా, ప్రస్తుతం రూ.2,203 చెల్లిస్తున్నారు.

8 లక్షలకు పైగా ధాన్యం దిగుబడి

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 3,51,843 ఎకరాల్లో వరి వేశారు. ఇందులో 3,50,765 ఎకరాలకు పంటల క్రాపింగ్ జరిగింది. 3,34,330 ఎకరాలకు ఇకెవైసి పూర్తయింది. ఈ సంవత్సరం 8.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో 7,87,447 మెట్రిక్ టన్నులు మార్కెట్‌లోకి వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుగుణంగా 390 కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలును ప్రారంభించింది. ధాన్యం కొనుగోళ్లలో పాత కథే పునరావృతమవుతోంది. సాంకేతిక సమస్యలు, సిబ్బంది, జిపిఎస్ పరికరాల కొరతతో కొనుగోలులో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు ప్రక్రియ క్లిష్టతరం కావడంతో కొన్నిచోట్ల రైతులు దళారులకు తక్కువ ధరే ఇచ్చుకుంటున్నారు.

రబీలోనూ వర్షాభావ పరిస్థితులే...

రబీలోనూ వర్షాభావ పరిస్థితులే తలెత్తాయి. డిసెంబరులో వర్షాలు పెద్దగా లేకపోవడంతో, అపరాల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. నేలలో తేమ శాతం తక్కువగా ఉండడంతో మినుము, పెసర పంటలను వేయలేకపోయారు. రబీలో పెసర సాధారణ సాగు 46,645 ఎకరాలు ఉండగా, ఇప్పటివరకు 765 ఎకరాల్లో సాగైంది. మినుము సాధారణంగా 70,340 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా 1152.5 ఎకరాల్లో వేశారు. గతంలో మునుపెన్నడూ లేని విధంగా వంశధార, నాగావళి నదుల్లో నీటి ప్రవాహం జీరో లెవల్స్‌కు పడిపోయాయి. ఒడిశాల్లోనూ వర్షాలు లేకపోవడంతో గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. ఖరీఫ్ చివరిలో పంటలు ఎండిపోతుండడంతో తోటపల్లి, మడ్డువలస నుంచి నీటిని విడిచిపెట్టి పంటలను కాపాడారు. గొట్టాబ్యారేజీ, మడ్డువలస రిజర్వాయర్ల నీటి నిల్వలు బాగా పడిపోయాయి.

మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె

శ్రీకాకుళం అర్బన్ : ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం

పలు సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మున్సిపాల్టీల్లోని 630 కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెలో భాగస్వామ్యమయ్యారు. సమ్మెలో భాగంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఉపాధ్యక్షులు ఎ.గణేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రతో పాటు అసెంబ్లీలో ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని మాట ఇచ్చి మడమ తిప్పడం అన్యాయమన్నారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. జిఒ నంబరు 7 ప్రకారం క్లాప్ డ్రైవర్లకు నెలకు రూ.18,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, పెన్షన్ ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన పోరాటానికి ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. ఆమదాలవలసలో మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద నిరవధిక సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.సంతోష్ కుమార్, జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా బైఠాయించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమేష్ కుమార్ పట్నాయక్, కార్మికులు పాల్గొన్నారు. పలాసలో కాశీబుగ్గలోని గాంధీ విగ్రహం వద్ద నిరవధిక సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, యూనియన్ నాయకులు సిహెచ్.మురగన్, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : బైఠాయించిన మున్సిపల్ కార్మికులు

పలాస : గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

సైకో పాలనతో రాష్ట్రం అతలాకుతలం

- మరో అవకాశం ఇస్తే అరాచకాలే
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు

ర్యాలీగా వెళ్తున్న రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం

ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకొచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సైకో పాలనతో రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. కోటబొమ్మాళి టిడిపి కార్యాలయం నుంచి జైత్రయాత్ర పేరిట బైక్ ర్యాలీని ప్రారంభించారు. ముందువరుసలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ద్విచక్ర వాహనంపై వెళ్లగా, చైతన్యరథంలో కార్యకర్తలు, ప్రజలకు అచ్చెన్నాయుడు అభివాదం చేశారు. పెద్దసంఖ్యలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు జనసేన కార్యకర్తలు కూడా బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. కోటబొమ్మాళిలో ప్రారంభమైన ర్యాలీ సంతబొమ్మాళి, టెక్కలిలో సాగి నందిగాంలో ముగిసింది. ఆయా చోట్ల అచ్చెన్నాయుడు మాట్లాడుతూ జగన్‌కు మరో అవకాశం ఇస్తే నియంతృత్వం, అరాచక పాలనకు అవకాశం ఇచ్చినట్లేనన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా ఐదేళ్లు పరిపాలించడం సిగ్గుచేటు అన్నారు. జగన్ తీసుకునే నిర్ణయాలపై న్యాయస్థానాలు ఎన్నిసార్లు మొట్టికాయలు వేసినా ఆయనలో మార్పు రాలేదన్నారు. సంక్షేమం పేరిట ప్రజలపై ధరలు, పన్నుల భారాలను మోపారని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి జాడే లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించి అణగదొక్కాలని చూశారని విమర్శించారు. చివరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టినా అరెస్టులు చేసే నియంత పాలన రాష్ట్రంలో నెలకొందన్నారు. ఈ నియంత పాలనకు వచ్చే ఎన్నికల్లో చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఎంపీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఇదే ఉత్సాహంతో మరో వంద రోజులు కష్టపడి పనిచేస్తే టిడిపి విజయకేతనం ఎగురవేస్తామన్నారు. అందుకోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, నాయకులు బోయిన రమేష్, పినకాన అజయ్‌కుమార్, బగాది శేషగిరి, జీరు భీమారావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కె.హరివరప్రసాద్, రెడ్డి అప్పన్న, కర్రి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కిషోర్ కుమార్

నేటి నుంచి యుటిఎఫ్ పోరుబాట

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆర్థిక సంబంధ బకాయిలు విడుదల చేయాలని, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ నేటి నుంచి పలురూపాల్లో ఆందోళనా కార్యక్రమాలు చేపడుతున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ తెలిపారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే ప్రతి నెలా ఒకటో తేదీన జీతం, మెరుగైన పిఆర్‌సి, సకాలంలో డిఎలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీనిచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకొచ్చాక ఉద్యోగులు, ఉపాధ్యాయులపై భిన్నమైన వైఖరిని అవలంబిస్తూ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళనబాట పడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 27న తాలూకా కేంద్రాల్లో ఆరు గంటల ధర్నా, జనవరి మూడో తేదీన జిల్లా కేంద్రంలో 12 గంటల ధర్నా, 9, 10వ తేదీల్లో విజయవాడలో 36 గంటల ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. వీటిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, నాయకులు కె.వైకుంఠరావు, కె.దాలయ్య, బి.ధనలక్ష్మి, ఎం.వాగ్దేవి, పి.అప్పారావు, వై.ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటికి మూలపేట పోర్టు సందర్శన వాయిదా

ప్రజాశక్తి - పోలాకి

సంతబొమ్మాళి మండలం మూలపేటలో జోరుగా సాగుతున్న పోర్టు నిర్మాణ పనులను పరిశీలించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త వై.వి సుబ్బారెడ్డి ఆధ్వర్యాన ఈనెల 27న వెళ్లాల్సిన ప్రజాప్రతినిధుల బృందం పర్యటన ఈనెల 28వ తేదీకి వాయిదా పడింది. పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్ తదితరులు సంయుక్తంగా విశ్వసముద్ర సంస్థ నిర్మిస్తున్న పోర్టు నిర్మాణ పనులను పరిశీలించాల్సి ఉంది. వై.వి సుబ్బారెడ్డికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నుంచి అత్యవసర పిలుపు రావడంతో పర్యటనను 28వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తేదీ మార్పు మినహా ముందుగా అనుకున్నట్లుగానే తొలుత మూలపేట పోర్టు, అనంతరం కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సందర్శన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వైసిపి నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 27 నుంచి జనవరి రెండో తేదీ వరకు ఎపిపిఎస్‌సి ఆధ్వర్యాన డిపార్ట్‌మెంటల్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో లెక్చరర్ల పోస్టుల పరీక్షను జనవరి నాలుగో తేదీన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరీక్షలు సక్రమ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డిఆర్‌ఒ ఛాంబరులో ఎపిపిఎస్‌సి అధికారులు, పోలీస్, విద్యుత్, వైద్య, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ తదితర అధికారులతో పరీక్షల నిర్వహణపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్ల మండలంలోని శివానీ, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి హాల్ టిక్కెట్, ఒరిజినల్ ఐడి ప్రూఫ్ తప్ప మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు, ఐప్యాడ్, బ్లూటూత్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఆబ్జెక్టివ్ మాదిరి పరీక్షలకు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే పరీక్షలకు ఉదయం 9.30 గంటల్లోపు, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే పరీక్షలకు 2.30 గంటల్లోపు పరీక్ష కేంద్రానికి హాజరు కావాలన్నారు. కంప్యూటర్ల పనితీరును ఒక సారి చెక్ చేసుకోవాలన్నారు. మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్‌ఒ మీనాక్షికి సూచించారు. సమావేశంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, సెక్షన్ అధికారి ఎస్.ప్రతాప్ కుమార్, ఎచ్చెర్ల తహశీల్దార్ సత్యనారాయణ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

బ్యాటింగ్ చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎందరో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులకు నెలవైన శ్రీకాకుళం జిల్లా ఖ్యాతిని నేటి తరం యువత ఇనుమడింపజేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలిలోని ఎన్‌టిఆర్ ఎంహెచ్ పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఆయన, జాతీయ గీతాలాపన అనంతరం క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించి, ఒలింపిక్ జ్యోతిని వెలిగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 47 రోజుల పాటు నిర్వహించే పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. జిల్లావ్యాప్తంగా పలు క్రీడాంశాల్లో 11,500 జట్లు నమోదు చేసుకున్నాయని తెలిపారు. ఐదు దశల్లో నిర్వహించే పోటీల్లో మెరుగైన జట్లు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయని వివరించారు. ఈ పోటీలకు గానూ మంచి నాణ్యతతో కూడిన కిట్లు అందుబాటులో ఉంచామన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీయడం ఈ పోటీల ప్రధాన ఉద్దేశమన్నారు. అనంతరం ఆయన కొద్దిసేపు క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించిన రాష్ట్ర బ్రాండ్ అంబాసిడర్ ఆటగాళ్లు తోటాడ శ్రీనివాస్ (బేస్‌బాల్), కూటికుప్పల వరలక్ష్మి (సాఫ్ట్‌బాల్), బి.ప్రసన్న రామచంద్రరావు (అథ్లెటిక్స్)ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్, సెట్‌శ్రీ సిఇఒలు ఆర్.వెంకట్రామన్, ప్రసాదరావు, డిఎస్‌డిఒ శ్రీధర్, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి ఎం.వాసుదేవరావు, జిల్లా సమాచార అధికారి బాలమాన్ సింగ్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సాంబమూర్తి, మాజీ కార్యదర్శి సుందర్రావు, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఉజ్వల్, కోచ్ మాధురి, పిఇటిలు తదితరులు పాల్గొన్నారు.

మోత మోగించిన అంగన్వాడీలు

పళ్లాలు మోగిస్తూ నిరసన

పొందూరు : అంగన్వాడీలకు మద్దతుగా గరిటెలతో పళ్లాలు వాయిస్తున్న చిన్నారుల తల్లులు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 15వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా అంగన్వాడీలు గరిటెలతో పళ్లాలు మోగిస్తూ నిరసన తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ఖాళీ పళ్లాలను గరిటెలతో వాయిస్తూ మా ఆకలి తీర్చండి అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, కె.సంధ్య, అప్పలనరసమ్మ తదితరులు పాల్గొన్నారు. ఎచ్చెర్లలో సమ్మె శిబిరం వద్ద పళ్లాలను గరిటెలతో వాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.శారద వై.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రణస్థలంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఖాళీ పళ్లాలను మోగిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సుజాత తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలసలో సమ్మె శిబిరంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పంచాది లతాదేవి, పి. భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. టెక్కలిలో తహశీల్దార్ ప్రవల్లికా ప్రియకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు, అంగన్వాడీ నాయకులు బి.ధనలక్ష్మి, నాగలక్ష్మి, చామంతి తదితరులు పాల్గొన్నారు. కొత్తూరులో సమ్మె శిబిరంలో పళ్లాలను గరిటెలతో వాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.లక్ష్మి, హేమలత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పొందూరులో అంగన్వాడీలకు మద్దతుగా గర్భిణులు, బాలింతలు తమ చిన్నారులతో కలిసి సంఘీభావం తెలిపారు. గరిటెలతో పళ్లాలను వాయిస్తూ నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు విజయ్‌మోహన్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.జ్యోతిలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో బస్టాండ్ కూడలి వద్ద సమ్మె శిబిరంలో పళ్లాలను గరిటెలతో వాయించి నిరసన తెలిపారు. పాతపట్నంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.శాంతామణి, డి.లలిత తదితరులు పాల్గొన్నారు. పలాసలో పళ్లాలను గరిటెలతో వాయించి నిరసన తెలిపారు. సమ్మెకు ఆశావర్కర్లు, గ్రీన్ ఆర్మీ సభ్యులు బి.గోపాల్, బి.దుర్యోధన, బి.ఓంకార్, సినీ కళాకారుడు రాపాక రామకృష్ణ సంఘీభావం తెలిపారు.

ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయరు?

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు

గత ఎన్నికల్లో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎందుకు అమలు చేయడం లేదని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. కోటబొమ్మాళి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కంటే రూ.వెయ్యి ఎక్కువ వేతనం ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి హామీ నెర్చవేర్చలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా మొండిగా వ్యవహరించడం వల్లే సమ్మెబాట పట్టాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. టిడిపి అధికారంలోకొస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కె.కామేశ్వరరావు సంఘీభావం తెలిపారు. జెవివి జిల్లా కార్యదర్శి ఎస్.సంజీవరావు, సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, శ్రీకాకుళం

S.O.P.No.16/2023

Between:

1.మొగాలపు జయప్రసాద్

2.ఐచ్చుల విజయకుమారి ...పిటీషనర్లు

మరియు

బ్రాంచ్ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జి.టి.రోడ్డు, శ్రీకాకుళం. ...రెస్పాండెంటు

జనరల్ నోటీసు

పై నంబరు గల S.O.P. గ్రంథంలో ఈ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు పిటీషనర్లు శ్రీకోర్టు వారి ఎదుట మొగాలపు పాల్ నిరంజన్ రావుకి వారసులుగా డిక్లేర్ చేసి సక్సెసన్ సర్టిఫికేట్ ఇప్పించమని కోరుతూ పై S.O.P. గ్రంథమును దాఖలు చేసియున్నారు. కావున ఈ జనరల్ పబ్లికేషన్ ద్వారా తెలియజేయునది ఏమనగా సదరు S.O.P. గ్రంథములో ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల ది.25-1-2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు పైకోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ యొక్క అభ్యంతరములు తెలియపరుచుకోవలెను.

వై.భవాని ప్రసాద్, కరణం అప్పలనాయుడు
న్యాయవాదులు,
తేది.27-12-2023 రాజమహేంద్రవరం.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' ప్రారంభం

రణస్థలం : బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

టెక్కలి : బ్యాటింగ్ చేస్తున్న జెసి నవీన్

ప్రజాశక్తి– రణస్థలం

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ఆడుదాం ఆంధ్రా ద్వారా గ్రామీణస్థాయిలో వివిధ నైపుణ్యాలు కలిగిన వారిని ఎంపిక చేసి వారిని మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు పోటీలు నిర్వహిస్తారని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాతర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా క్రికెట్ ఆటను ప్రారంభించి బ్యాటింగ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, మండల స్పెషల్ ఆఫీసర్ దుర్గారావు, ఎంపిడిఒ రమణమూర్తి, ఎఒ ధనుంజయరావు, ఎంఇఒలు త్రినాథరావు, లావణ్య, సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆడుదాం ఆంధ్రా పోటీలను ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రారంభించారు. అనంతరం బాలీబాల్ సర్వీసింగ్ చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావు, సర్పంచ్ బోసి రామారావు, కరణం శశిభూషణరావు పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను సబ్ కలెక్టర్ ఎం.నవీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రభుత్వం ప్రోత్సాహిస్తుందని అన్నారు. జిల్లాలో 732 గ్రామ సచివాలయాల పరిధిలో 630 క్రీడా మైదానాలను ఎంపిక చేశామని తెలిపారు. లక్షా ఏడు వేల మంది నమోదు చేసుకున్నారని అన్నారు. 47 రోజుల పాటు నిర్వహించనున్న క్రీడల్లో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలు ఉంటాయని అన్నారు. జనవరి 9లోగా సచివాలయం పరిధిలో క్రీడలు పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నూరుల్ కమల్, నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి, ఎంపిపి అట్ల సరోజనమ్మ, తహశీల్దార్ కురమాన ప్రవల్లికాప్రియ, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీభాయ్, వైసిపి మండల అధ్యక్షులు బగాది హరి, చింతాడ మంజు పాల్గొన్నారు.

నందిగాం: నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా పోటీలను కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, ఎంపిడిఒ శివప్రసాద్, ఇఒపిఆర్‌డి రాజారావు ఎంఇఒలు నర్సింహులు, చిన్నారావు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రమేష్ కార్యదర్శి జానకి పాల్గొన్నారు.

ఆమదాలవలస: శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ అన్నారు. ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడలను ప్రారంఎంచారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, వైసిపి నాయకులు దుంపల శ్యామలరావు, పి.శ్రీనివాసరావు, భిట్టు, ఎన్.చిన్నారావు, కె.సత్యనారాయణ, ఎస్.రాజు, బి.వి.రమణమూర్తి పాల్గొన్నారు. కగా, తొలిరోజు క్రికెట్, టెన్నిస్ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. అలాగే మండలంలోని వెదుళ్లవలసలో సర్పంచ్ సురేష్ ప్రారంభించారు.

సరుబుజ్జిలి : మండలంలో రొట్టవలసలో జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కె.వి.జి.వెంకట సత్యనారాయణ ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.మురళీమోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మందస : మండలంలోని దున్నవూరు సచివాలయం వద్ద ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా బ్యాడ్మింటన్ పోటీలను సర్పంచ్ తిమ్మల కృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిటిసి తెప్పల ఉమాపతి, కిరణ్, కార్యదర్శి గొరకల ధర్మ, సిఐఫ్ ఆనంద్ పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ, భావనపాడులో ఆడుదాం ఆంధ్రా పోటీలను జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి ప్రారంభించారు. టెక్కలి వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు రవికుమార్‌రెడ్డి, ఎం.సంజీవ్, పాల మహేష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక సురంగి రాజా క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీడాప్ ఛైర్మన్ శాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎస్.బాబూరావు, టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్ పట్నాయక్, టౌన్ జెసిఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు, మండల జెసిఎస్ అధ్యఓఉలు ఆశి పురుషోత్తం, పత్తి అన్వేష్ పాల్గొన్నారు.

కవిటి: కవిటి జూనియర్ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను ఎంపిపి ఎంపిపి కడియాల పద్మ ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, ఎఎంసి వైస్ ఛైర్మన్ నీలయ్య, కో–ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎంపిటిసిలు పూడి నీలాచలం, చందాన పూర్ణచంద్రరావు, నాయకులు బెండాళం రమణమూర్తి, ఎన్ని అశోక్ పాల్గొన్నారు.

పొందూరు : మండలంలోని రాపాకలో సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించారు. మండలంలోని పలు సచివాలయాలలో బాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి పాల్గొన్నారు.

పలాస : కాశీబగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆడుదాం ఆంధ్రా పోటీలను ఛైర్మన్ బల్ల గిరిబాబు, ఆర్‌డిఒ భరత్‌నాయక్‌లు ప్రారంభించారు. ఈ మేరకు గిరిబాబు బ్యాడ్మింటన్ ఆటను ఆడారు. **అలాగే** మండలంలోని రెంటికోట ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్‌లు శాసనపురి తిరుమలరావు, దువ్వాడ వామాక్షి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, సచివాలయం కన్వీనర్ దువ్వాడ రవికుమార్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని గోవిందపురం, పల్లిసారథి, అమలపాడు, గరుడుభద్ర, పల్లివూరు,నగరంపల్లి, నువ్వలరేవు, రేయిపాడు, సైనూరు, దోకులపాడు సచివాలయాల పరిధిలో క్రికెట్, షటిల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరవెల్లి ఉదయ్‌కుమార్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు దువ్వాడ మధు కేశవరావు, వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు మద్దిల హరినారాయణ, సర్పంచ్‌లు పాలిన ఉమామహేశ్వరరావు, దున్న రత్నంబాలరాజు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీలను ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కళ్ల సంజీవరావు, పేడాడ వెంకటరావు, కవిటి రామరాజు, నేతింటి అప్పలస్వామి పాల్గొన్నారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించారు. డిటి ఆర్.మదు, ఆర్ఐ శివ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని జగన్నాథపురంలో సర్పంచ్ జోగి రాములమ్మ, పిఎసిఎస్ ఛైర్మన్ కెల్లి జగన్నాయకులు, సంతబొమ్మాళిలో సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి ,ఎంపిటిసి దూబ లక్ష్మిలు ఆడుదాం ఆంధ్రా ఆటను ప్రారంభించారు. కార్యక్రమంలో మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు పుక్కళ్ల లక్ష్మణరావు, ఆర్.హెచ్.పురం సర్పంచ్ ఎన్ని మన్మథరావు, కార్యదర్శులు రాధారాణి, ఎస్.డిల్లేశ్వరరావు, ఎస్.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : వాలీబాల్ సర్వీస్ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

సంతబొమ్మాళి : పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

పలాస : బాల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న ఛైర్మన్ గిరిబాబు

పొందూరు : పోటీలను ప్రారంభిస్తున్న గిరిబాబు

కవిటి : బ్యాటింగ్ చేస్తున్న ఎంపిపి పద్మ

కోటబొమ్మాళి : బ్యాటింగ్ చేస్తున్న ఉమామహేశ్వరరావు

లోడు చేస్తున్న ధాన్యం

ధాన్యం కొనుగోలు ప్రారంభం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి– కవిటి

'ధాన్యం కొనేదెప్పుడు?' అంటూ సోమవారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎడి జగన్మోహనరావు మంగళవారం కవిటి చేరుకుని వ్యవసాయ సహాయకులతో సమావేశమయ్యారు. ధాన్యం సేకరించేందుకు మనమే రైతు వద్దకు వెళ్లాలని, రైతులు తమ వద్దకు రారని స్పష్టం చేశారు. అంతేకాకుండా ప్రతి వ్యవసాయ సహాయకుని వద్దా తన పరిధిలో ఉన్న రైతుకు సంబంధించిన పూర్తి వివరాలు ఉండాలని సూచించారు. ఇప్పటివరకు శాంపిల్ తీసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. దీంతో అప్పటికే సిద్ధంగా ఉన్న ధాన్యంతో కవిటి మండలం జగతిలో కొనుగోలు ప్రారంభించారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ రామారావు, ఎంపిపి కడియాల పద్మ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సిద్ధంగా ఉన్న 870 బస్తాల ధాన్యం మిల్లులకు తరలించారు. ఎడితో పాటు ఎఒలు నరసింహమూర్తి, సత్యనారాయణ ఉన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు

గర్భిణులకు వైద్యం అందించరా!

ప్రజాశక్తి– పలాస

పలాస ప్రభుత్వాస్పత్రికి గర్భిణులను తీసుకొస్తే వైద్యం చేయకుండా రిఫర్ చేయడం సరికాదని గిరిజన సంఘం నాయకులు సవర జగన్నాయకులు, సవర రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆస్పత్రి వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇది ప్రభుత్వాస్పత్రా? రిఫర్ ఆస్పత్రా? అంటూ వైద్య పనితీరుపై మండిపడ్డారు. ఇటీవల జగనన్న కాలనీకి చెందిన సవర రోజా అనే గర్భిణి ప్రసవ వేదనతో పలాస ప్రభుత్వాస్పత్రికి వస్తే.. వైద్యులు పరీక్షించకుండా రిఫర్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గర్భిణిని ఎందుకు రిఫర్ చేశారని వైద్యులను అడిగితే తమకు తెలియదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో సూపరింటెండెంట్ రమేష్ మృతి చెందిన తర్వాత ఆస్పత్రి పరిస్థితి దారుణంగా ఉందన్నారు. సాక్షాత్తు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇక్కడ సౌకర్యాలు లేవని పత్రికలకు వివరణ ఇచ్చారంటే ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుందని అన్నారు. కనీసం డెలివరీ చేసే పరిస్థితి లేని దౌర్భాగ్య స్థితిలో వైద్యులు ఉండడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సవర ఈశ్వరరావు, సవర భీమారావు, సవర రామారావు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్'లో పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి– టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్అండ్ హెచ్ విభాగంలో ఆంగ్లభాష అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట మారుతీప్రసాద్ రాసిన 'ది టెక్స్ బుక్ ఆఫ్ నానోటెక్నాలజీ' నూతన పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్, ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జెఎన్‌టియు యూనివర్శిటీ పరిధిలోని మొదటి ఏడాది బిటెక్ విద్యార్థులకు, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, ఆంధ్రా యూనివర్శిటీ పరిధిలో ఉన్న డిగ్రీ విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే నానోటెక్నాలజీపై అధ్యయనం చేయాలనుకున్న వారు అప్లికేషన్స్ ఇంప్లిమెంట్ చేసేందుకు దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌డి డాక్టర్ ఆర్.శాంతికుమార్, అసిస్టెంట్ హెచ్ఐడి డాక్టర్ ఎం.రమణయ్య, సివిల్, హెచ్ఐడి డాక్టర్ పి.దినకర్, మెకానికల్ అసిస్టెంట్ హెచ్ఐడి డాక్టర్ శ్రీహరి, డాక్టర్ వై.లక్ష్మణరావు, రచయిత వెంకట మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

జీవనోపాధికి అధిక ప్రాధాన్యం

ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ అనూప్

ప్రజాశక్తి– ఆమదాలవలస

చేనేత కార్మికుల జీవనోపాధికి సిక్కోలు వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ అధిక ప్రాధాన్యతను ఇస్తున్నదని ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటర్ నూక అనూప్ అన్నారు. మండలంలోని శ్రీనివాసాచార్యులపేటలో సిక్కోలు వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ నాలుగవ మహాజనసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిక్కోలు వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సంస్థ చేనేత కార్మికుల సుస్థిరాభివృద్ధి జీవనోపాధికి కృషి చేస్తుందని తెలిపారు. చేనేత కార్మికులకు అధిక వేతనాలు, కొత్త డిజైన్లతో కార్మికులకు పని కల్పించామని తెలిపారు. గతేడాది అధిక పనిచేసిన కార్మికులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం సిక్కోలు కంపెనీ ఛైర్మన్ బి.వాసుదేవరావు మాట్లాడుతూ ఇప్పటివరకు 513 మంది చేనేత కార్మికులకు ఈ సంస్థ ద్వారా ఉపాధి కల్పించామని అన్నారు. చేనేత కార్మికుడు శ్రీను మాట్లాడుతూ సిక్కోలు వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా ఎక్కువ మందికి ఉపాధి కల్పించామని తెలిపారు. సిక్కోలు వీవర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ సిఇఒ బి.ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ట్స్ మన్యం సహజ సిఇఒ బెండి శంకరరావు, మా తోట సిఇఒ రవి, సిక్కోలు వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ డైరెక్టర్స్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సరుకులను పంపిణీ చేస్తున్న అనూప్

క్రీడాకారులకు అభినందన

ప్రజాశక్తి– ఇచ్ఛాపురం

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు మంగళవారం బయలు దేరుతున్న సిహెచ్.గిరి, ఆసి రేవంత్‌లకు స్థానికులు ,అభినందనలు తెలిపారు. ఈ పోటీలు మధ్యప్రదేశ్‌లోని బేతుల్ నగరంలో ఈ నెల 30 నుంచి జనవరి 5 వరకు జరుగుతాయి. వీరికి ప్రయాణ ఖర్చులకు వ్యాపారవేత్తలు వల్లంపాటి శ్రీరామ్, ప్రదీప్, బాట వెంకటేష్‌లు రూ.7 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ప్రతినిధి పిలక విజయభాస్కరరెడ్డి, వార్డు కౌన్సిలర్లు సిగ్గు ప్రేమ్‌కుమార్, కాళ్ల దిలీప్, ఆర్మీ విశ్రాంత ఉద్యోగి ఎల్.సి.రావు, కోచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'ఆశా'ల ధర్నా

కొత్తూరు : ఆశా కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలని ఆశా యూనియన్ నాయకులు ఎస్.గౌరమ్మ, కె.జ్యోత్స్న, పి.జయమ్మ, ఎ.జగదాంబ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రాడ్యుటీ, పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. అనంతరం తహశీల్దార్ ఎం.చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లావణ్య, లక్ష్మి, ఆలరాజు, రమణమ్మ, ఎర్రమ్మ, నిర్మల పాల్గొన్నారు.

పలాస : తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ ఎల్.మధుసూదనరావును కలిసి వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో ఎం.లావణ్య, కె.జ్యోతి, పి.పార్వతి, నీరజ, వై.హేమలత, పి.లక్ష్మీకాంతం, శ్రీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పి.పద్మావతి, కె.బి.ఇందుమతి, చామంతి, జ్యోతి, బి.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

నివాళ్లర్పిస్తున్న నాయకులు
(ఇన్‌సెట్‌లో సూర్యనారాయణ ఫైల్)

జెడ్‌పి మాజీ ఛైర్మన్ వై.వి కన్నుమూత

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్

జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ ఎచ్చెర్ల సూర్యనారాయణ (66) సోమవారం అర్ధరాత్రి విశాఖలోని ప్రయివేటు ఆస్పత్రిలో కన్నుమూశారు. గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల ఆయనకు శస్త్ర చికిత్స అందించి కిడ్నీ మార్పిడి చేశారు. శస్త్ర చికిత్స అనంతరం కోలుకున్న ఆయన సోమవారం సాయంత్రం తిరిగి అస్వస్థతకు గురయ్యారు. ఇన్‌ఫెక్షన్ సోకడంతో పరిస్థితి విషమించిందని వైద్యులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సోమవారం ఒంటి గంటల సమయంలో పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థీపదేహాన్ని అరసవల్లిలోని ఆయన స్వగృహానికి మంగళవారం తీసుకొచ్చారు. ప్రస్తుతం వైసిపి నాయకునిగా కొనసాగుతున్నారు. టిడిపిలో శ్రీకాకుళం రూరల్ మండలం కిల్లిపాలెం సర్పంచ్‌గా పనిచేశారు. 1995 నుంచి క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరించారు. శ్రీకాకుళం జెడ్‌పిటిసిగా ఎన్నికై అనూహ్యంగా జెడ్‌పి ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఐదేళ్ల పాటు తనదైనశైలిలో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. తదనంతర పరిణామాల్లో టిడిపిని వీడి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వెంట నడిచారు. వైసిపిలో చేరిన ఆయన పదవులకు దూరంగానే ఉన్నారు. ప్రస్తుతం ఆయన కోడలు రుప్ప దివ్య శ్రీకాకుళం జెడ్‌పిటిసిగా కొనసాగుతున్నారు. పెద్దకుమారుడు సత్యనారాయణ యుఎస్‌లో ఉన్నారు. చిన్న కుమారుడు శ్రీధర్ రాజకీయాల్లో తన వెంట నడుస్తు వ్యాపారాలు చేసుకుంటున్నారు.

పలువురి నివాళి

సూర్యనారాయణ కన్నుమూత విషయం తెలుసుకుని రాజకీయాలకతీతంగా పలువురు నాయకులు నివాళ్లర్పించారు. మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, వైసిపి నాయకులు ధర్మాన రాంమనోహరనాయుడు, మెండ స్వరూప్, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్, డిసిఎంఎస్ ఛైర్మన్ గొండు కృష్ణమూర్తి, గార ఎంపిపి రఘురాం, అంబటి శ్రీనివాసరావు, ద్వాపు అజిత్, అనురాధ పాల్గొని నివాళ్లర్పించారు.

టిడిపి పూర్వ వైభవానికి కృషి

మందస : వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష టిడిపి, జనసేన నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. మందసలో టిడిపి, జనసేన నాయకులతోఁ, కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అరాచకాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సోషల్ మీడియాలో టిడిపి, జనసేనపై వైసిపి నాయకులు పెడుతున్న పోస్టులకు స్పందించి అందుకు ధీటుగా సమాధానం చెప్పాలన్నారు. పార్టీకి నష్టం వాటిల్లకుండా కార్యకర్తలు జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు జి.కె.నాయుడు, బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, దాసరి తాతారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గౌతు శిరీష

అంగన్వాడీల డిమాండ్లను నెరవేర్చాలి

శ్రీకాకుళం అర్బన్ : న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు, టిడిపి నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 15 రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్న కారణంగా చిన్న పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు పూర్తిగా సేవలు నిలిచిపోయాయని వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు సహాయకుల న్యాయం డిమాండ్లను పరిష్కరించి కేంద్రాలు తిరిగి పున:ప్రారంభించాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న అప్పలనాయుడు

ధర్నాపై సన్నాహక సమావేశం

టెక్కలి : ఉపాధ్యాయులకు బకాయిపడిన పిఎఫ్, డిఎ, ఎస్ఎల్, ఎపిజిఎల్ఐలు తక్షణమే ప్రభుత్వం చెల్లించాలని కోరుతూ బుధవారం టెక్కలి పాత తాలుకా కేంద్రం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.గణపతిరావు, తమ్మినేని వైకుంఠరావులు తెలిపారు. ఈ మేరకు డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే తమ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఆరు గంటల పాటు నిర్వహించే ఈ ధర్నా స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా సహ అధ్యక్షులు కురమాన దాలయ్య, సీనియర్ నాయకులు పాలవలస ధర్మారావు, రోణంకి విజయ్‌కుమార్, మారం కుమారస్వామి, డి.వైకుంఠరావు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణచైతన్య జన్మదిన వేడుకలు

నరసన్నపేట: ధర్మాన కుటుంబంపై అపారమైన ప్రేమాభిమానాలు కురిపిస్తున్న ప్రజలందరికీ రుణపడి ఉంటామని వైసిపి బిసి సెల్ జోనల్ ఇన్‌ఛార్జి, పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. నియోజకవర్గంలో మంగళవారం కృష్ణచైతన్య పుట్టినరోజు వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, వైసిపి సిఇసి సభ్యులు ధర్మాన పద్మప్రియ, కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ధర్మాన రాందాస్, ధర్మాన రామలింగంనాయుడు, డిసిసిబి ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందజేస్తున్న నాయకులు

రోడ్డుపై బోల్తా పడిన ట్రాక్టర్
(ఇన్‌సెట్‌లో శ్రీరాములు మృతదేహం)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి– పలాస

మండలంలోని రంగోయి కూడలి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సోంపేట మండలం రుషికుడ్డకు చెందిన తెప్పల శ్రీరాములు (53) మృతి చెందగా, సోంపేటకు చెందిన పైల రాముడు, పలాస మండలం మాకన్నపల్లికి చెందిన జుత్తు లక్ష్మణరావుకు తీవ్ర గాయాలయ్యాయి. కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాకన్నపల్లికి చెందిన జుత్తు లక్ష్మణరావు తన ట్రాక్టర్‌లో పాడి రైతుల నుంచి పాలు సేకరించి మండలంలోని హరిపురంలో ఉన్న విశాఖ డెయిరీ పాల కేంద్రానికి వెళ్తుంది. ఈ సమయంలో పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీరాములు, జుత్తు లక్ష్మణరావు, పైల రాముడుకు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను హరిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం టెక్కలి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శ్రీరాములు మృతి చెందారు. మృతుడికి సోంపేట మండలం రుషికుడ్డ. మొదటి భార్య మృతి చెందడంతో, మాకన్నపల్లికి చెందిన చెందిన జుత్తు రోహిణితో రెండో పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి మాకన్నపల్లిలో నివాసం ఉంటున్నాడు. తన బావమరిది జుత్తు లక్ష్మణరావు ట్రాక్టర్‌లో కూలీగా పని చేస్తున్నా డు. మృతుడికి భార్య రోహిణి, నలుగురు పిల్లలు ఉన్నారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోల్తా పడిన టూరిస్టు బస్సు

టూరిస్టు బస్సు బోల్తా

పలువురికి స్వల్ప గాయాలు

ఇచ్ఛాపురం : మండలంలోని లొద్దపుట్టి జాతీయ రహదారిపై టూరిస్టు బస్సు బోల్తా పడింది. బస్సులోని ప్రయాణిస్తున్న టూరిస్టులకు స్వల్పగాయాలయ్యాయి. కేరళ నుంచి జార్ఖండ వెళు న్న టూరిస్టు బస్సు వేగంగా వస్తుండగా డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో బోల్తా పడిందని స్థానికులు చెబుతున్నారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను 108లో ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఆహార అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈయన వెంట సీడాప్ ఛైర్మన్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, ఉప్పడ నారాయణమ్మ, నర్తు నరేంద్ర, ఉప్పడ రాజారెడ్డి, చిట్టిబాబు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రైమ్ కార్నర్

సముద్రంలో బాలుడు గల్లంతు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన ఒక ప్రయివేట్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు మందస మండలం సిగలపుట్టుగ సముద్ర తీరానికి మంగళవారం పిక్నిక్‌కు వెళ్లారు. సముద్రంలో స్నానం చేస్తుండగా... అలలు తాకిడికి ఆశి జయరాం, చందు, మేఘన కొట్టుకుపోయారు. వెంటనే స్థానికులు గమనించి చందు, మేఘనలను ఒడ్డుకు చేర్చారు. జయరాం గల్లంతయ్యాడు. అస్వస్థతకు గురైన చందు, మేఘనలను జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. గల్లంతైన జయరాంది బెల్లుపడ గ్రామం గొల్లవీధికి చెందిన వాడు. జయరాం కోసం స్థానిక మత్స్యకారుల సహాయంతో మెరైన్ సిఐ రమేష్‌కుమార్ ఆధ్వర్యాన బోట్ల సహాయంతో గాలింపు చర్యలు చేపడుతున్నారు.

జయరాం

తండ్రి, తమ్ముడే హంతకులు

లావేరు: మండలంలోని కేశవరాయునిపాలెంలో ఈ నెల 22న జరిగిన గుర్తు తెలియని వ్యక్తులు చేతులో హత్యకు గురైన గుజ్జు పోలిరెడ్డిని సొంత తండ్రి, తమ్ముడే కర్రలతో దాడి చేసి హత్య చేశారని జె.ఆర్.పురం, సిఐ ఆదాం, లావేరు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిందితులను అరెస్టు చేసి లావేరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. మృతిని భార్య గౌరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి బృందాలుగా గాలించి దర్యాప్తు చేశామన్నారు. మంగళవారం సాంకేతిక, ఇతర వివరాల ఆధారంగా నిందితులను గుర్తించి రెవెన్యూ అధికారులతో అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. మృతుడు మద్యానికి, ఇతర వ్యసనాలకు బానిసై ఆర్థికంగా ఎదగనివ్వకుండా అడ్డుతగులుతున్నాడని, పోలిరెడ్డిని హత్య చేయాలని తండ్రి, తమ్ముడు నిర్ణయించుకున్నారని అన్నారు. ఈ నెల 22న రాత్రి మృతుడు తమ్ముడు శ్రీను అన్నకు పూటుగా మద్యాన్ని తాగించి తండ్రి యరకయ్యతో కలిసి కర్రతో గట్టిగా కొట్టి హతమార్చినట్టుగా నిందితులు అంగీకరించారని చెప్పారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ రమేష్‌నాయుడు

తెలుగుజాతి వైభవం విశ్వవ్యాప్తం కావాలి

ప్రజాశక్తి- పలాస

తెలుగు వైభవం విశ్వవ్యాప్తం కావాలని పలాస ఎంపిడిఒ ఎస్.రమేష్‌నాయుడు అన్నారు. ఆంధ్ర సారస్వతా పరిషత్ చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యాన రాజ రాజనరేంద్రుని పట్టాభి శేఖ సహస్రబ్ది నీరాజనంగా రాజమండ్రిలో జనవరి 5,6,7 తేదీల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల ప్రచార పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు భాషలో ఇరవై ఐదు సాహితీ ప్రక్రియలపై మూడు రోజుల పాటు సదస్సులు, రాజరాజ నరేంద్రునికి వెయ్యి కవితలతో నీరాజన కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయని అన్నారు. సారస్వతా పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి లఖినాన రవికుమార్ మాట్లాడుతూ ఈ మహాసభలకు, తెలుగు గవర్నర్లు, రాజకీయ ప్రముఖులు, సినీ ప్రముఖులు, సంగీత కళాకారులు, గాయకులు పాల్గొంటారని తెలిపారు. సరస్వతా పరిషత్ కార్యవర్గ సభ్యులు డాక్టర్ కుమార్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డిఎల్‌పిఒ ఇప్పిలి వెంకటరమణ, జన జాగ్రతి అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి, రంగం సంస్కృతిక సంస్థ రాష్ట్ర కార్యదర్శి కొనారీ హేమసూదన్, నెమలిపురి అప్పారావు, రైతు సంఘం సభ్యులు బాలాజీరావు, రోనంకి హేమాచలం పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించే విధంగా కృషి చేస్తుందని టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. తన స్వగృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మంగళవారం నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్థాయిలోని ఆణిముత్యాలను వెలికితీస్తుందన్నారు. క్రీడలు సచివాలయం స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. 40 ఏళ్ల రాజకీయాలు చేసిన కీర్తిశేషులు కింజరాపు ఎర్రన్నాయుడు, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు జిల్లాకు, ప్రజలకు అనుగుణంగా ఏ ఒక్క అభివృద్ధి పనులు చేపట్టలేదని విమర్శించారు.

స్టాల్స్‌ను పరిశీలిస్తున్న పీడీ కిరణ్ కుమార్

మెప్మా బజార్లతో ఆర్థిక స్వావలంబన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళల్లో సుస్థిర ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం మెప్మా బజార్లను ప్రోత్సహిస్తోందని పీడీ ఎం.కిరణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన మెప్మా బజారును మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేసున్నాయని తెలిపారు. వీటితోపాటుగా వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఆర్థిక లబ్ధి దాదాపుగా మహిళలకే అందుతుందని, వాటిని ఆదాయాభివృద్ధికే వినియోగించాలన్నారు. వైఎస్ఆర్ ఆసరా (రుణమాఫీ) నాలుగో విడత నిధుల విడుదలకు లబ్ధిదారుల బయోమెట్రిక్ నమోదు చేపడుతున్నామని, అర్హులందరూ నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక మెప్మా సిబ్బంది రాజేష్, నాగమణి, అమ్మినాయుడు పాల్గొన్నారు.

లెప్రసీ కాలనీలో క్రిస్మస్ వేడుకలు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని లెప్పర్సీ కాలనీలో ఉన్న కరుణ సమాజం ఆధ్వర్యాన మంగళవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పాల్గొని సభ్యులకు నిత్యావసర సరకులు, దుస్తులు, దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు, కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, అదనపు డిఎంహెచ్‌ఒ డాక్టర్ అనురాధ, చిన్మయరావు, పి.శ్రీకాంత్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

శ్రీకాకుళం అర్బన్ : బాబా పటేసింగ్, జురావర్ సింగ్ బలిదానానికి గుర్తుగా బాలల రక్షిత గృహాల్లో మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యాన వీర్‌బాల్ దినోత్స వాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ పాల్గొని వివిధ రకాల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణ, సంస్థల బాలల రక్షణాధికారి మెట్ట మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న శాంతిశ్రీ

అరసవల్లి హుండీ ఆదాయం రూ.55.75 లక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని మంగళవారం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో నిర్వహించారు. 53 రోజుల పాటు హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ సంప్రదాయం ప్రకారం లెక్కించారు. ఈ ఏడాది నంబరు నుంచి డిసెంబరు 26 వరకు హుండీలో నోట్ల రూపంలో రూ.53,77,616, చిల్లర నాణేలు రూపంలో రూ.1,97,619 సమకూరాయి. వాటితో పాటు 15 గ్రాముల 5 మిల్లీ గ్రాములు బంగారం, 2 కేజీల 200 గ్రాముల వెండి లభ్యమైంది.

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అలాగే అమెరికా డాలర్లు 8, రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండ్ 50 పౌండ్స్, నేపాల్ రూ.65 విదేశీ మారక ద్రవ్యం నోట్ల రూపేంలో సమకూరిందని ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. హుండీ లెక్కింపును విజయనగరం జిల్లా రామతీర్థం ఇఒ కిషోర్‌కుమార్, ఆలయ అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ పర్యవేక్షించారు. పాలక మండలి సభ్యులు జలగడుగుల శ్రీనివాస్, జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ కార్యాలయం సినియర్ అసిస్టెంట్ జి.వి.బి.ఎస్.రవికుమార్ పాల్గొన్నారు.

ఎటిఎం మోడల్స్ క్షేత్ర పరిశీలన

ప్రజాశక్తి- రణస్థలం

ఎటిఎం మోడల్స్ క్షేత్రాన్ని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ అధికారి హేమ సుందర్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని రణస్థలం, పెద్ద యామలపేట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయలను ఎటిఎం మోడల్స్ ద్వారా పండిస్తున్న రైతులు గులివెందుల జ్యోతి, పెంటిమాని సత్యనారాయణ, బోనెల వరలక్ష్మి యొక్క పొలాలను, ద్రవ జీవామృతం పిట్స్‌ను సందర్శించారు. ప్రతి కుటుంబమూ 20 సెంట్లు విస్తీర్ణంలో వేసుకున్నట్లయితే నెలకు సుమారుగా రూ.10 నుంచి రూ.15వేల ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఒక కుటుంబానికి కావాల్సిన ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు లభిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యముగా భూమి లోపల జీవవైవిధ్యం పెరిగి మొక్కలకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా అందుతాయని, వివిధ పంటల వేర్లు భూమిలో వివిధ రకాల సూక్ష్మజీవులకు ఆశ్రయము కల్పించి తద్వారా మొక్కలకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు లభిస్తాయని అన్నారు. చిడపీడలను, తెగుళ్లను తట్టుకుంటుందని, నేల గుల్ల భారీ వానపాములు వృద్ధి చెందుతాయని తెలిపారు. ద్రవ జీవామృతం శాశ్వత సిమెంట్ కుండీలు ఒక యూనిట్ ఏర్పాటుకు రూ.800 నుంచి 1200 వరకు ఖర్చవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, డిజిటల్ కార్యకర్త కలవరపు శివశంకర్, యూనిట్ ఇన్‌ఛార్జి గంట్యాడ ఏసుబాబు పాల్గొన్నారు.

క్షేత్రాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

మాట్లాడుతున్న శివరాంప్రసాద్

బకాయిలను చెల్లించాలి

టెక్కలి : ఉపాధ్యాయులకు బకాయి పడిన డిఎను తక్షణమే విడుదల చేయాలని ఎపి ఉపాధ్యాయ సంఘం (ఎపియుఎస్) జిల్లా అధ్యక్షులు దుప్పల శివరామ్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిఎలు, తదితర డిమాండ్లను పరిష్కరించకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఆపస్ రాష్ట్ర కార్యదర్శి డి.చలపతిరావు మాట్లాడుతూ ప్రాథమిక విద్యను అనిశ్చితికి గురిచేస్తూ ఉపాధ్యాయులపై తీవ్ర పనిభారాన్ని మోపుతున్న జిఒ 117ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆపస్ రాష్ట్ర గౌరవ సలహాదారు తమ్మినేని ఆనందరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కీలు సోమేశ్వరరావు, చాలపాక రమణలు ఈ ఏడాది నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో డి.వి.వి.కృష, పి.కాశీవిశ్వనాత్, ఎస్.నరసింగరావు, లింగరాజు, ఎస్.ఫాల్గుణరావు, పి.ఉషారాణి పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న మోహనరావు

ఘనంగా చార్లెస్ బాబేజ్ జయంతి

ఆమదాలవలస : ప్రస్తుత సమాజం కంప్యూటర్ సృష్టికర్త చార్లెస్ బాబేజ్‌కు ఎంతో రుణపడి ఉంటుందని సెట్‌శ్రీ మాజీ సిఇఒ సురంగి మోహనరావు అన్నారు. కంప్యూటర్ సష్టికర్త చార్లెస్ బాబేజ్ జయంతి వేడుకలు స్థానిక ఇమ్మానుయేల్ కంప్యూటర్ సంస్థ అధినేత పొన్నాడ విజయకృష్ణ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ కంప్యూటర్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వచ్చిందని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు భవిష్యత్‌కు కీలక పాత్ర పోషిస్తోన్న కంప్యూటర్ విద్యను అభ్యసించాలని కోరారు. ఎస్‌విఎస్ విద్యాసంస్థల అధినేత ప్రతాప్ మాట్లాడుతూ కంప్యూటర్లతో మానవ సమాజానికి విడదీయలేని సంబంధం ఏర్పడిందని అన్నారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ దుగ్గివలస రాంప్రసాద్ మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలను మనమే స్వయంగా సృష్టించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కొర్రాయి రవి, తారాచంద్, అఖిల పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

మెళియాపుట్టి : బాల్య వివాహాలను అరికట్టాలని డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ పిలుపునిచ్చారు. స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణ నుంచి మెళియాపుట్టి మెయిన్ రోడ్డు వరకు మంగళవారం నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు బాల్యవివాహాలు చేయవద్దని సూచించారు. వెలుగు ఎటిఎం లలిత, ఇసి వీరన్ననాయుడు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు అనూహ్య స్పందన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వం అమలు చేస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలకు అనూహ్య స్పందన వచ్చిందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళ వారం విలేకరులతో మాట్లాడారు. 45 రోజుల పాటు నిర్వహించనున్న క్రీడా పోటీలతో గ్రామీణ స్థాయిలో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను గుర్తించి వెలుగులో తెచ్చేందుకు దోహదపడుతుందని అన్నారు. సిఎం జగన్ క్రీడలను ప్రోత్సహిస్తు న్నారని అన్నారు. కార్యక్రమంలో సీడాప్ ఛైర్మన్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, వైస్ ఛైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బాబూరావు, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, ప్రత్తి అన్వేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాయిరాజ్, రామారావు

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష విద్యాశాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన చేపట్టిన నిరవదిక సమ్మె కొనసాగుతోంది. అందులో భాగంగా నగరంలోని మహాత్మ జ్యోతిరావు పూలే పార్కు వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.మురళీకృష్ణ, తవిటినాయుడు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పనిచేస్తున్న వివిధ విభాగాల కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని సిఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. హెచ్ఆర్ పాలసీ, సమాన పనికి సమాన వేతనం, వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటి అద్దె, కరువు భత్యం సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి గ్రాడ్యుటీ రూ.పది లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కోశాధికారి డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు యుగంధర్, రామకృష్ణ, వైకుంఠరావు పాల్గొన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న సందర్శించి సంఘీభావం తెలిపారు.

భూ అక్రమాలపై సిట్ దర్యాప్తు చేపట్టాలి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములు, డి-పట్టాలు ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నందుకు సిట్‌తో విచారణ చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌డిఒ భరత్ నాయక్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి ఈ ప్రాంతంలో భూముల రేట్లు అమాంతంగా పెరగడంతో ప్రభుత్వ భూములు కొందరు భూ కబ్జాదారులు కొండ, కాలువలు చెరువులు ఆక్రమించుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులు రికార్డుల ప్రకారం గుర్తించి వాటిని పరిరక్షించాలని కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని గరుడభద్ర ఉన్నత పాఠశాల సమీపం నుంచి పల్లిసారథి వరకు నిర్మించనున్న రోడ్డు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులను ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ పరిశీలించి గోర్జీని పరిశీలించి రోడ్డును వేయాలని సర్పంచ్ సర్పంచ్ ప్రతినిధి గూడ ఈశ్వరరావుకు సూచించారు. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న గోర్జీని రోడ్డుగా తీర్చిద్దాలన్నదే తన జీవితకాలం కల అని ఉదయ్ కుమార్ వివరించారు. ఈ రోడ్డు పనులు ప్రారంభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో రాజాం సర్పంచ్, ఎంపిటిసిలు పిట్ట గీత, పిట్ట సుగుణ, గరుడభద్ర సర్పంచ్ గూడ గిరిజ, సచివాలయ కన్వీనర్ ఎ.దానేసు, యువజన సంఘ అధ్యక్షుడు వై.సంతోష్‌కుమార్, జి.భాస్కరరావు, వై.ఆనందరావు, జి.నగేష్, ఎ.నారాయణరావు, వై.సురేష్ పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు : పరిశీలిస్తున్న రత్నంబాలరాజు

రీ సర్వేతో రైతులకు మేలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

భూముల రీ సర్వే తో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని సర్పంచ్ దున్న రత్నం బాలరాజు అన్నారు. మండలంలోని అమలపాడు సచివాలయం ఆవరణలో భూ రీ సర్వేకు తీసుకొచ్చిన డ్రోన్‌ను మంగళవారం పరిశీలించారు. డ్రోన్ పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న భూ రక్ష శాశ్వత భూ హక్కు పథకం కింద ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా భూములను సర్వే చేయిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ గిరి, వార్డు సబ్యులు చిరంజీవి, సర్వేయర్ సోమేష్, విఆర్‌ఒ కూర్మారావు, కార్యదర్శి సుధారాణి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని మేఘవరంలో మాజీ సర్పంచ్ పరపటి మేనకేతనరెడ్డి, జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ సూరాడ జోగారావు సమగ్ర భూ సర్వేను ప్రా రంభించారు. కార్యక్రమంలో చింతు రామారావు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి బాలచంద్రారెడ్డి

పోలీస్‌స్టేషన్ సందర్శన

కోటబొమ్మాళి: స్థానిక స్టేషన్ పరిధిలో క్రైం రేటును మరింత తగ్గిస్తూ, దీర్ఘకాలికంగా ఉన్న మొండి కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించాలని టెక్కలి డిఎస్‌పి కె.బాలచంద్రారెడ్డి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వార్షిక మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు అన్ని రికార్డులను పరిశీలించి గ్రామాల్లో పరిస్థితులను, జాతీయ రాహదారిలో ప్రమాదాల వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో శాంతియుతమైన వాతావరణం కలిగేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. సిఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ ఉన్నారు.

'ఎంజిఆర్' ఆర్థికసాయం

ఎన్ఎన్‌పేట : మండలంలోని బాలేరులో మంగళవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాతపట్నం నియోజకవర్గ టిడిపి నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు పాల్గొన్నారు. అనంతరం క్రిస్మస్ వేడుకలకు రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. ఏ సమస్య ఉన్నా ఒక అన్న తమ్ముడిలా ప్రజల ముందు ఉంటానని తెలిపారు. ప్రేమ భావాన్ని, సేవాతత్పరతను, క్షమా గుణాన్ని బోధించిన క్రీస్తు జన్మదినం క్రైస్తవలకు అత్యంత ముఖ్యమైన పండగ క్రిస్మస్ అని తెలిపారు.

మాట్లాడుతున్న గోవిందరావు